# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ 30.12.2024 | 24 క్యారెట్లు 78,415.00 | కిలో వెండి 97,666.00 | 30°C | సంపుటి:3 | సంచిక:68

www.vishalabharati.com


# కేసీఆర్, కేటీఆర్‌ను ఇరికించింది హరీశ్ రావే

- ఓఆర్ఆర్ లీజు అంశంపై విచారణ జరుగుతోంది
- ఆర్ఆర్ఆర్ ఆరేళ్లు ఆలస్యమైంది
- ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- మార్చిలో పనులు ప్రారంభమవుతాయి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లీజు అంశంపై విచారణ జరుగుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి హరీశ్ రావు తన మామ కేసీఆర్, బామ్మర్ది కేటీఆర్‌ను ఇరికించేందుకే ఓఆర్ఆర్ టోల్ లీజ్‌పై సిట్ వేయాలని అడిగారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హరీశ్ రావు అసెంబ్లీలో కోరడంతోనే సీఎం రేవంత్ రెడ్డి సిట్ ఏర్పాటు చేశారన్నారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో దొంగలు దొరికారని మంత్రి చెప్పారు. ఓఆర్ఆర్ టోల్ లీజ్‌లో

..మిగతా 2 లో

# 2024@ 2,34,158 కేసులు

## రాష్ట్రంలో పెరిగిన నేరాల సంఖ్య

- గతేడాది కంటే 9.87 శాతం హైక్
- ఏడాదిలో 2945 అత్యాచార కేసులు
- 1,942 డ్రగ్స్ కేసుల్లో 4,682 మంది అరెస్ట్
- రాష్ట్ర వ్యాప్తంగా 142.95 కోట్ల డ్రగ్స్ సీజ్
- 33,618 సైబర్ క్రైమ్ కేసులు.. రూ.180 కోట్ల రికవరీ
- అల్లు అర్జున్‌పై కొనసాగుతున్న దర్యాప్తు
- డ్రగ్స్ లేని తెలంగాణ సాధనే లక్ష్యం
- నేరాల వివరాలు వెల్లడించిన డీజీపీ జితేందర్



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కొత్త నేర చట్టాల అమలు కోసం పోలీసులకు శిక్షణ ఇచ్చామని.. డిజిటల్ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని డీజీపీ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది సైబర్ క్రైమ్ నేరాలు పెరిగాయని డీజీపీ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 43.33 శాతం సైబర్ క్రైమ్ నేరాలు పెరిగాయని.. ఈ ఏడాది 33,618 సైబర్ క్రైమ్ కేసులను నమోదు చేశామని.. 1525 కిడ్నాప్, 703 చోరీ, 58 దోపిడీ, 856 హత్య, 2945 అత్యాచారాల కేసులు నమోదు చేశామని తెలిపారు. డయల్ 100కు 16,92,173 ఫిర్యాదులు వచ్చాయని.. కొత్త చట్టం వచ్చిన తర్వాత 85,190 కేసులను నమోదు చేసినట్లు వివరించారు. కొత్త చట్టం ప్రకారం సైబరాబాద్

..మిగతా 2 లో

> “తెలంగాణలో గతేడాదితో పోలిస్తే ఈసారి 9.87 శాతం కేసులు పెరిగాయని.. 2,34,158 కేసులు నమోదైనట్లు రాష్ట్ర డీజీపీ జితేందర్ తెలిపారు. డ్రగ్స్ లేని తెలంగాణ సాధనే పోలీస్ శాఖ లక్ష్యమని అన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో నేర వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ ఏడాది శాంతి భద్రతలు బాగున్నాయని.. ఒకటి రెండు ఘటనలు మినహా పూర్తి అదుపులో ఉన్నట్లు చెప్పారు. తెలంగాణలో క్రైమ్ రేటు, లా & ఆర్డర్, సైబర్ క్రైమ్, డ్రగ్స్ స్మగ్లింగ్ వంటి వివిధ అంశాలను వెల్లడించారు. దీని ప్రకారం 2024లో తెలంగాణలో క్రైమ్ రేటు గణనీయంగా పెరిగింది. 2023తో పోలిస్తే, ఈ ఏడాది 9.87 శాతం పెరిగి 2,34,158 కేసులు నమోదు అయ్యాయి.




# సంక్రాంతికి 5వేల స్పెషల్ బస్సులు

- ప్రయాణికులకు టీఎస్ ఆర్టీసీ గుడ్ న్యూస్
- పలు జిల్లాలతో పాటు ఏపీకి సర్వీసులు
- సాధారణ ఛార్జీలా..? డబుల్ ఛార్జీలా..?
- టికెట్ ధరలపై కొరవడిన స్పష్టత

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్ర ప్రజలకు టీఎస్ఆర్టీసీ గుడ్ న్యూస్ చెప్పింది. సంక్రాంతికి వేల సంఖ్యలో అదనపు బస్సులు నడపనున్నట్లు ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమైన పండగల్లో సంక్రాంతి ఒకటి. ఈ పండక్కి చాలా మంది సొంతూళ్లకు వెళ్తుంటారు. ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు.. పండక్కి కచ్చితంగా స్వగ్రామాలకు తరలివెళ్తుంటారు. అందుకు ట్రైన్లతో పాటుగా ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తుంటారు. మరికొందరు

..మిగతా 2 లో



## తెలుగు సినిమాను అక్కినేని మరో స్థాయికి తీసుకువెళ్లారు

- భారతీయ చిత్రాల వైపు ప్రపంచ దేశాల చూపు
- మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ

..మిగతా 3 లో




## ఓయూ జేఏసీకి బెదిరింపులు

- అల్లుఅర్జున్ అభిమానుల నుంచి మాకు ప్రాణహాని
- చంపేస్తామంటూ వందల కాల్స్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థి నేతలు

..మిగతా 3 లో



## కన్నుల పండుగగా మల్లన్న కల్యాణం

- కొమురవెల్లికి పోటెత్తిన భక్తులు
- మల్లన్న శరణు అంటూ మార్మోగిన ఆలయ ప్రాంగణం
- ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు

..మిగతా 3 లో



## గాల్లో కలిసిన 179 మంది ప్రాణాలు..

- దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం
- రన్‌వేపై అదుపు తప్పి గోడను ఢీకొట్టిన ఫ్లైట్
- ప్రమాద కారణాలపై అధికారుల దర్యాప్తు

..మిగతా 3 లో

# బుమ్రా@200 వికెట్లు


- టెస్టుల్లో అరుదైన ఘనత
- తొలి భారత ఫాస్ట్ బౌలర్‌గా రికార్డ్
- ప్రపంచ మేటి బౌలర్లను వెనక్కినెట్టిన భారత పేసర్



విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:

భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అతి తక్కువ టెస్టు మ్యాచుల్లో 200 వికెట్లు తీసిన తొలి భారత ఫాస్ట్ బౌలర్‌గా నిలిచాడు. భారత్ ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో భాగంగా, మెల్‌బోర్న్‌లో జరుగుతున్న నాలుగో టెస్టు మ్యాచ్‌లో బుమ్రా కొత్త

..మిగతా 4 లో



## ఏఐతో ముప్పు

- రాబోయే 20 ఏళ్లలో మారనున్న అంచనాలు
- భద్రతపై ప్రభుత్వ నియంత్రణే ముఖ్యం
- గాడ్ ఫాదర్ ఆఫ్ ఏఐ జెఫ్రీ హింటన్

..మిగతా 2 లో

## రాజకీయంగా ఎదుర్కోలేకనే.. కేటీఆర్ పై అక్రమ కేసులు

- ఏం చేసినా భయపడే ప్రసక్తే లేదు
- మాది భయపడే రక్తం కాదు.. భయపెట్టే రక్తం
- నిప్పుకణికల్లా బయటకు వస్తారు
- రాష్ట్రంలో పోలీసు జులుం నడుస్తోంది
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తమ పార్టీ అధినేత కేసీఆర్ ను రాజకీయంగా ఎదుర్కోలేక తనపై, కేటీఆర్ పై కాంగ్రెస్, బీజేపీ

పార్టీలు కలిసి అక్రమ కేసులు పెడుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నిర్బంధాలకు పాల్పడినా భయపడే ప్రసక్తే లేదని అన్నారు. తమది భయపడే రక్తం కాదని... భయపెట్టే రక్తమన్నారు. తాము తప్పు చేయలేదని... భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. ఎన్ని కేసులు పెట్టిన బీఆర్ఎస్ కార్యకర్తలు నిప్పు కణికల్లా బయటికి వస్తారని కవిత తేల్చిచెప్పారు. జైలుకు వెళ్లి విడుదలైన తర్వాత తొలిసారి నిజామాబాద్ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద బీఆర్ఎస్

..మిగతా 3 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
30.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## కండోమ్స్ సేల్స్‌లో బెంగళూరు టాప్

విశాలభారతి, నేషనల్ బ్యూరో:భారతదేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. అన్ని రంగాల్లో ప్రపంచానికి పోటీ ఇస్తోంది. బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్ లాంటి నగరాలు అయితే అన్ని విషయాల్లోనూ నువ్వా నేనా అన్నట్టు సాగుతున్నాయి. ఐటీ, సాఫ్ట్వేర్ లాంటి వాఇల్లో అయితే ఒకదానిని మించి మరొకటి పోటీ పడుతున్నాయి. అయితే ఎన్ని వచ్చినా ఈ విషయంలో బెంగళూరును బీట్ చేసేవారే లేరు. ఇప్పుడు బెంగళూరు మర విషయంలో కూడా టాప్‌గా నిస్తోందిట. ఇది వినడానికి కొంత వింతైన విషయమే అయినా చెప్పకోక తప్పదు. టెక్ సిటీ ఇప్పుడు కండోమ్ సిటీగా మారుతుందని చెబుతున్నారు.ఏటీ కండోమ్ సిటీనా...ఏంటీ అని ఆశ్చర్యపోతున్నారా...అందులో అంత ఆశ్చర్యపోవడానికి ఏమీ లేదండి. దేశంలో అత్యంత ఎక్కువగా కండోమ్స్ బెంగళూరులో అమ్ముడుపోతున్నాయని చెబుతోంది స్విగ్గీ. స్విగ్గీ ఇన్స్టా మార్ట్‌లో రాత్రి 10 నుంచి 11 గంటల మధ్యలో అత్యంత రహస్యంగా ఇకడ కండోమ్స్ సేల్ అవుతున్నాయి చెప్పింది. దీని తర్వాత స్థానంలో ఢిల్లీ, హైదరాబాద్ నగరాలు ఉన్నాయి. రాత్రి 10 గంటల తర్వాత కస్టమర్లు ఎక్కువగా కండోమ్‌లే కొనుగోలు చేస్తున్నట్లుగా తెలిపింది ఇన్స్టామార్ట్. ఆన్‌లైన్ షాపింగ్‌లో ఇవే ఎక్కువగా కొంటున్నట్లుగా వెల్లడించింది. 140 ఆర్డర్స్‌లో ఒక సెక్స్ వెల్నెస్ ఐటెమ్ ఉంటుందని తెలిపింది. బెంగళూరు వాసులు కండోమ్స్ ఎక్కువగా కొనుగోలు చేసినట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వార్షిక నివేదికలో తెలిపింది. కండోమ్స్‌తో పాటు రాత్రి పదిగంటల తర్వాత మసాలా ఫ్లేవర్ చిపస్ కుర్కురేల ఆర్డర్లు ఎక్కువగా వస్తాయి అని చెబుతోంది స్విగ్గీ ఇన్‌స్టా మార్ట్.



# 2024@ 2,34,158 కేసులు

తరువాయి భాగం

పరిధిలో 15,360, హైదరాబాద్‌లో 10,501, రాచకొండలో 10,251 కేసులు నమోదయ్యాయి. సైబర్ క్రైమ్ కేసుల్లో రూ.180 కోట్లను తిరిగి బాధితులకు అప్పగించామని.. రాష్ట్రవ్యాప్తంగా 142.95 కోట్లు మాదకద్రవ్యాలను సీజ్ చేసి.. డ్రగ్స్ కేసుల్లో 4,682 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. జీరో శాతం డ్రగ్స్ దిశగా పోలీస్ శాఖ తగిన చర్యలు తీసుకుందని డీజీపీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 85 మంది నక్సల్స్ అరెస్ట్ కాగా, 41 మందిని సరెండర్ చేయించడం జరిగిందని తెలిపారు.

ఈ ఏడాది ముగ్గురికి న్యాయస్థానాలు మరణ శిక్ష విధించాయని.. హైదరాబాద్ ఇద్దరు, సంగారెడ్డి ఒక కేసులో మరణ శిక్ష విధించినట్లు డీజీపీ చెప్పారు. 'ఈ ఏడాది రౌడీ షీటర్లకు 18 కేసుల్లో 35 మందికి జీవిత ఖైదు విధించారు. అత్యాచారం కేసుల్లో ఈ ఏడాది 3 కేసుల్లో నలుగురికి జీవిత ఖైదీ విధింపు. మహిళలపై దాడులకు సంబంధించి 51 కేసుల్లో 70 మందికి జీవిత ఖైదు విధించారు. పోక్సో కేసులు 77 నమోదు కాగా 82 మందికి శిక్ష ఖరారైంది. ఫింగర్ ప్రింట్స్ టీమ్ 507 కేసులు ఛేదించారు. 71 గుర్తు తెలియని మృతదేహాలను గుర్తించారు. షీ టీమ్స్ 10,862 పబ్లిక్ ప్రదేశాల్లో వేదింపులు ఫిర్యాదులు, అందులో 830 FIRలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 27 భరోసా సెంటర్లు ఏర్పాటు చేశాం.

2024 సంవత్సరంలో 20,702 రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు తగ్గినట్లు డీజీపీ తెలిపారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 11,64,645 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై డీజీపీ స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కొనసాగుతుందని చెప్పారు. ఈ కేసులో సీబీఐకి లేఖ రాశామన్నారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్నవారిని అమెరికా నుండి ఇండియాకు రప్పించే విషయంలో ఇంటర్నేషనల్ ప్రాసెస్ జరుగుతుందని, ఇప్పటికే ఇంటర్ పోల్ సహాయం తీసుకుంటున్నామని, ప్రభాకర్ రావును హైదరాబాద్‌కు తీసుకురావడానికి సమయం పడుతుందని డీజీపీ తెలిపారు. టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ కేసు విషయంపై మీడియా ప్రశ్నించగా.. అల్లు అర్జున్ కేసు కోర్టు పరిధిలో ఉందని, ఆ కేసులో సమగ్ర విచారణ జరుగుతుందని డీజీపీ తెలిపారు.

**పోలీస్ ఆత్మహత్యలపై..**

రాష్ట్రంలో పోలీస్ ఆత్మహత్యలపై డీజీపీ జితేందర్ స్పందించారు. 'ఈ ఏడాది కాదు, ప్రతి ఏడాది ఏదో ఒక కారణంతో సూసైడ్ చేసుకుంటున్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులు, వ్యక్తిగత ఇబ్బందులు, ఫ్యామిలీ ప్రాబ్లమ్స్‌తో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పోలీస్ శాఖ పరంగా ఎలాంటి సమస్యలు లేవు. చాలా చోట్ల వ్యక్తిగత కారణాలతోనే బలవన్మరణాలు జరుగుతున్నాయి. పోలీసులకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాం' అని తెలిపారు.



# సంక్రాంతికి 5వేల స్పెషల్ బస్సులు

తరువాయి భాగం

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను, సొంత వాహనాలు ఉన్నవారు కార్లలో బయల్దేరుతుంటారు. అయినా సామాన్యులు ఎక్కువగా బస్సులనే ఆశ్రయిస్తుంటారు. అయితే సంక్రాంతి బస్సుల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. అందరూ స్వగ్రామాలకు వెళ్లేందుకు సిద్ధం కావటంతో బస్సుల్లో కాలు పెట్టేందుకు జాగా ఉండదు. ఈ నేపథ్యంలో బస్సు ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ తీపి కబురు చెప్పింది. సంక్రాంతి పండుగకు 5వేల ప్రత్యేక బస్సుల్ని నడపనున్నట్లు టీజీఎస్ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలోని జిల్లాలతో పాటు ఏపీకి నడిపే సర్వీసులు కూడా వీటిలో ఉంటాయని ఆర్టీసీ వర్గాలు వెల్లడించాయి. జనవరి మొదటి వారం నుంచి 10 రోజుల పాటు ఈ బస్సులు నడుస్తాయని తెలిపాయి. అయితే ఈ బస్సులు ఏయే రూట్లలోనే నడుస్తాయనే అశంపై త్వరలోనే క్లారిటీ ఇస్తామన్నారు. ఇక ఛార్జీలు ఎలా ఉంటాయనే దానిపై కూడా క్లారిటీ రావాల్సింది. ప్రస్తుతం తెలంగాణ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నారు. దసరాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లోనూ ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. కాకపోతే ప్రత్యేక బస్సుల్లో టికెట్ తీసుకునే వారికి కాస్త టికెట్ ధరలు పెంచారు. సంక్రాంతి బస్సుల్లోనూ ఇదే విధానం అమలు చేసే అవకాశం ఉంది.

**ఏపీఎస్ఆర్టీసీ 2400 స్పెషల్ బస్సులు**

హైదరాబాద్‌లో నివసించే ఏపీ వాసుల కోసం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సంక్రాంతి పండక్కి వెళ్లేవారి కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. సంక్రాంతి పండక్కి 2,400 ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. పండగ రద్దీని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే వారి కోసం ఈ బస్సులను నడపనున్నట్లు చెప్పారు. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు జనవరి 9 నుంచి 13 వరకు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులకు అదనపు ఛార్జీలు ఏవీ ఉండవని రెగ్యులర్ ఛార్జీలే ఉంటాయని స్పష్టం చేశారు.

# గొప్ప మనసు చాటుకున్న మంత్రి కోమటిరెడ్డి

- చదువుల తల్లికి ఆర్థిక సాయం
- ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.1,00,000 అందజేత
- ప్రతిభ గల ఏ విద్యార్థి చదువు ఆగిపోకూడదని ఆకాంక్ష
- మంత్రికి కృతజ్ఞతులు తెలిపిన విద్యార్థిని ప్రణవి



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరోసారి తన గొప్ప మనసు చాటుకున్నారు. తన కుమారుడి పేరు మీద.. ప్రతీక్ ఫౌండేషన్ స్థాపించి తరచూ ఏదో రకంగా సమాజ సేవ చేస్తూ.. పేద ప్రజల ముఖాల్లో విసిరే చిరునవ్వుల్లో తన కుమారున్ని చూసుకుంటుంటారు మంత్రి కోమటిరెడ్డి. ఈ క్రమంలోనే.. ఇటీవల సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ మరణించటంతో పాటు ఆమె కుమారుడు శ్రీతేజ్ కోమాలోకి వెళ్లిన విషయం తెలిసిందే. కాగా.. బాధిత కుటుంబానికి ఫౌండేషన్ తరపును రూ.25 లక్షల నగదుసాయాన్ని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అందించారు. తాజాగా.. మరో గొప్పపని చేసి తన ఉదారత చాటుకున్నారు.

ఇటలీలోని ప్రఖ్యాత విద్యాసంస్థ పాలిటెన్సికో డి టోరినోలో అర్కిటెక్చర్ కన్‌స్ట్రక్షన్‌లో మాస్టర్స్‌లో సీటొచ్చినా.. వెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేని విద్యార్థిని ప్రణవి చొల్లేటి పరిస్థితిని తెలుసుకుని చలించినపోయిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. వెంటనే స్పందించారు. ప్రణవిని ఇంటికి పిలిపించుకుని మాట్లాడారు. ప్రతీక్ ఫౌండేషన్ తరపున వెంటనే లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. తన చదువుకు అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు. ఏ అవసరం వచ్చినా తానున్నానని ప్రణవికి కోమటిరెడ్డి భరోసా ఇచ్చారు.

ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థి చదువు ఆగిపోతే.. వారి జీవితం ఆగిపోతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిభ కలిగిన ఏ విద్యార్థి చదువు ఆగిపోకూడదని కోమటిరెడ్డి పేర్కొన్నారు. జీవితాలను మార్చే ఆయుధం చదువు ఒక్కటేనని.. మంత్రి అభిప్రాయపడ్డారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన సాయంపై స్పందించిన ప్రణవి.. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎంతో అప్యాయంగా మాట్లాడారన్నారు. తామెవరమో తెలియకపోయినా తమ కష్టం తెలుసుకొని.. ఇంటికి పిలిచి స్వీట్లు ఇచ్చి మర్యాద చేశారని చెప్పుకొచ్చారు. తన చదువులకు అండగా ఉంటానని చెప్పారని ప్రణవి ఎమోషనల్ అయ్యారు. అప్పటికప్పుడే ఆర్థిక సహాయం చేసినట్టు తెలిపారు. తన చదువుల బాధ్యత తీసుకుంటానని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట ఇచ్చినట్టు ప్రణవి తెలిపారు. మంత్రి చేసిన సాయంపై ప్రణవి హర్షం వ్యక్తం చేశారు. తనలాంటి ఎంతో మంది పేద విద్యార్థల చదువులకు అండగా నిలబడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రణవి కృతజ్ఞతలు తెలిపారు.

# కేసీఆర్, కేటీఆర్‌ను ఇరికించింది హరీశ్ రావే

తరువాయి భాగం



అవకతవకలు కూడా బయటపడతాయన్నారు. ఇప్పటికే ఈ ఫార్ములా రేసు కేసులో ఒకరో ఇద్దరో జైలుకి పోతారని, ఓఆర్ఆర్ ఎపిసోడ్‌లో కూడా జైలుకి వెళతారన్నారు. ఆర్ఆర్ఆర్‌కి ఆరేళ్లు ఆలస్యమైందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

ఇప్పుడు టెండర్ల ప్రక్రియ కూడా ప్రారంభమైందన్నారు. మార్చిలో ఆర్ఆర్ఆర్ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఆర్ఆర్ఆర్ కోసం ఢిల్లీలో ఉండి ఎంతో కృషి చేసినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. 2017లో ఆగిపోయిన ప్రాజెక్టుకు తమ కృషి వల్ల ముందడుగు పడిందన్నారు. ఆర్ఆర్ఆర్ మంజూరు చేసిన ప్రధాని నరేంద్ర మోడీ, దీనికి సహకరించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

టెండర్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆర్ఆర్ఆర్ పనులకు కీలక ముందడుగు పడినట్లయిందన్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు కృషి చేసిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని సీఎం రేవంత్ అభినందించారు. ప్రత్యేకంగా ఫోన్ చేసి మాట్లాడారు. అందుకు కోమటిరెడ్డి బదులిస్తూ.. మీ చొరవ, కృషి, సహకారం, సలహాలతోనే ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు పట్టాలెక్కిందని రేవంత్ రెడ్డిని ప్రశంసించారు.

# ఓయూ జేఏసీకి బెదిరింపులు

- అల్లుఅర్జున్ అభిమానుల నుంచి మాకు ప్రాణహాని
- చంపేస్తామంటూ వందల కాల్స్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థి నేతలు





విశాలభారతి, స్టేట్ బ్యూరో:

హీరో అల్లు అర్జున్ ఫ్యాన్స్ నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయంటూ ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు ఓయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.'ఇంటిపై దాడి చేసినందుకు వెంటనే హీరో అల్లు అర్జున్‌కు క్షమాపణ చెప్పాలని అల్లు అర్మీ, అల్లు అర్జున్ అభిమానుల పేరుతో వందల కాల్స్ వస్తున్నాయని జేఏసీ నేతలు ఆరోపించారు. చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ అభిమానుల నుంచి తమకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఫోన్ నంబర్లను అల్లు అర్జున్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పెట్టి వైరల్ చేస్తున్నారని ఓయూ జేఏసీ నేతలు తమ ఫిర్యాదులో తెలిపారు. తమకు ఫోన్ కాల్స్ రాకుండా చేయాల్సిన బాధ్యత అల్లు అర్జున్‌దేనన్నారు. ఫోన్ కాల్స్ ఆగకపోతే వేలాది మందితో అర్జున్ ఇంటిని ముట్టడిస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు. ఫోన్ చేసి బెదిరిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో రేవతి మరణానికి అల్లు అర్జున్ కారణమంటూ ఇటీవల ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు అర్జున్ ఇంటివద్ద ఆందోళనకు దిగారు. రేవతి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ అల్లు అర్జున్ నివాసంపై రాళ్లను విసిరారు. ఆయన ఇంట్లోకి దూసుకెళ్లేందుకు ఓయూ జేఏసీ నేతలు ప్రయత్నించారు. ఈ క్రమంలో రాళ్లు తగిలి అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలు ధ్వంసమయ్యాయి.

# ఏఐతో మానవాళికి ముప్పు

- రాబోయే 20 ఏళ్లలో మారనున్న అంచనాలు
- భద్రతపై ప్రభుత్వ నియంత్రణే ముఖ్యం
- గాడ్ ఫాదర్ ఆఫ్ ఏఐ జెఫ్రీ హింటన్



విశాలభారతి, నేషనల్ బ్యూరో:

అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) రోజు రోజుకూ అభివృద్ధి చెందుతోంది. ఏఐకి గాడ్ ఫాదర్‌గా పిలుచుకునే బ్రిటిష్‌కెనడియన్ కంప్యూటర్ శాస్త్రవేత్త జెఫ్రీ హింటన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే మూడు దశాబ్దాల్లో ఏఐ వల్ల మానవ మనుగడకే ముప్పు ఏర్పడే అవకాశాలు 10 నుంచి 20 శాతం ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల బీబీసీ రేడియో 4కి చెందిన టూడే ప్రొగ్రామ్ ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు. గతంలోనే ఈయన రాబోయే రోజుల్లో ఏఐతో 10 శాతం ముప్పు ఉందని అంచనా వేశారు. ఇప్పుడు ఆ అంచనాను 20 శాతానికి పెంచారు.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వల్ల సంభవించే ముప్పు గురించి మీ అంచనాలో ఏదైనా మార్పు ఉందా అని అడగగా.. అది 10 నుంచి 20 శాతానికి పెరగిందని హింటన్ సమాధానమిచ్చారు. అంతేకాదు ఏఐ వ్యవస్థలను తల్లిగా.. వాటిని నియంత్రించే మానవులను పిల్లలతో పోల్చారు. 2023లో గూగుల్ సంస్థ నుంచి హింటన్ వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. నియంత్రణ లేని ఏఐ వల్ల భవిష్యత్తులో పొంచి ఉన్న ముప్పు గురించి స్వేచ్ఛగా మాట్లాడేందుకు ఆయన ఆ సంస్థ నుంచి వెళ్లిపోయారు. గతంలో ఏఐతో ఉన్న ప్రమాదాలపై ఆయన చెప్పిన విషయాలు సంచలనం రేపాయి.

రాబోయే 20 ఏళ్లలో అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వ్యవస్థలు మనుషుల కన్నా మరింత తెలివిగా మారుతాయని ఏఐ నిపుణులు అంచనాలపై హింటన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రంగంలో జరుగుతున్న అభివృద్ధి తాను ఊహించిన దానికన్నా చాలా వేగంగా ఉందని.. దీనిపై కచ్చితంగా ప్రభుత్వ నియంత్రణ ఉండాలని చెప్పారు. లాభాల కోసం నడిచే బడా కంపెనీలు ఏఐ అభివృద్ధికి సంబంధించి జాగ్రత్తలు పట్టించుకోవని అన్నారు. ఏఐ భద్రతకు సంబంధించి ప్రభుత్వ నియంత్రణే ముఖ్యమని పేర్కొన్నారు.

# ఎవ్వరికీ ఇబ్బంది కలిగించొద్దు

- ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి
- డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు
- హయత్ నగర్ సీఐ నాగరాజు గౌడ్




పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

2025 నూతన సంవత్సర వేడుకలు హైదరాబాద్ నగరం సిద్ధమవుతోంది. ఇప్పటికే పలు సంస్థలు పెద్ద ఎత్తున పార్టీలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో హయత్‌నగర్‌పరిధిలో నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ నాగరాజు గౌడ్ హెచ్చరించారు. ఆదివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వేడుకల్లో భాగంగా చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదని సూచించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి తీసుకున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే తాగి వాహనాలు నడపొద్దని.. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేడుకల సందర్భంగా పోలీసు సిబ్బందితో ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తామని తెలిపారు. చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించి, అల్లర్లు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
30.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## తెలుగు సినిమాను అక్కినేని మరో స్థాయికి తీసుకువెళ్లారు

విశాలభారతి, నేషనల్ బ్యూరో:ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే 'మన్‌కీ బాత్' కార్యక్రమం 117వ ఎపిసోడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పలు విషయాలు పంచుకున్నారు. అక్కినేని నాగేశ్వరరావు తెలుగు సినిమాకు చేసిన కృషిని కొనియాడారు. తెలుగు సినిమాను ఆయన మరోస్థాయికి తీసుకువెళ్లారని ప్రశంసించారు. నాగేశ్వరరావు సినిమాల్లో భారతీయ సంప్రదాయాలు, విలువలను చాలా చక్కగా చూపించేవారని గుర్తు చేసుకున్నారు. బాలీవుడ్ దర్శకుడు తపన్ సిన్హాసినిమాలు సమాజానికి కొత్త బాటలు వేశాయని పేర్కొన్నారు. రాజ్ కపూర్ తన సినిమాల ద్వారా భారతదేశంలోని సున్నితమైన అంశాలను ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. భారతీయ చలనచిత్ర రంగం వైపు ప్రపంచ దేశాలు చూస్తున్నాయని ప్రధాని అన్నారు. తొలిసారిగా వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్‌ను వచ్చే ఏడాది మన దేశంలో నిర్వహించబోతున్నామని ప్రధాని చెప్పారు. ఈ సమ్మిట్‌లో మీడియా, వినోద పరిశ్రమకు చెందిన ప్రపంచ దేశాల దిగ్గజాలు పాల్గొంటారని తెలిపారు. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడుతూ.. రాజ్యాంగం భారతీయులందరికీ ఓ మార్గనిర్దేశకం అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఓ ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ పవిత్ర గ్రంథంపై ప్రజలు తమ అభిప్రాయాలను వీడియోలుగా రూపొందించి.. ఈ వెబ్‌సైట్‌లో పంచుకోవాలని పిలుపునిచ్చారు.



## రాజకీయంగా ఎదుర్కోలేకనే..
# కేటీఆర్ పై అక్రమ కేసులు

తరువాయి భాగం

ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజీరెడ్డి గోవర్ధన్, ఇతర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గజమాలతో జిల్లాకు స్వాగతం చెప్పారు. భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు. అక్కడి నుంచి ప్రజలతో కలిసి భారీ ర్యాలీగా నిజామాబాద్ పట్టణంలోని సుభాష్ నగర్ కు చేరుకొని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... అనేక ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా పిడికిలి ఎత్తి అన్ని ఎదురించి వచ్చాననని, తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని.. దేనికీ భయపడనని తేల్చిచెప్పారు. పోరాటం చేసి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన వాళ్లం....గట్టిగా నిలబడుతాం.. ప్రజల పక్షనా పోరాటం చేస్తామని పునరుద్ఘాటించారు.

**కాంగ్రెస్ సర్కారుకు భయమెందుకు..?**

కేంద్రాన్ని ఎదురించి ప్రశ్నిస్తే బీజేపీ కేసులు పెడుతోందని, ఇక రాష్ట్రంలో అక్రమ కేసులపై గురించి చెప్పనవసరం లేదని అన్నారు. ముఖ్యమంత్రి పేరు మర్చి పోయినా, రైతులు భూములు ఇవ్వకపోయినా, సోషల్ మీడియాలో ప్రశ్నించినా, ప్రభుత్వాన్ని విమర్శించినా సీఎం రేవంత్ రెడ్డి తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని చెప్పారు. బరువు ఎత్తుకొని బాధ్యత భుజాన వేసుకున్న వాళ్లకు ఓపిక ఉండాలని, కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకింత భయమని ప్రశ్నించారు. రాష్ట్రంలో పీపుల్స్ ఫ్రెండ్లీ పోలిసింగ్ పోయి... కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసింగ్ వచ్చిందని, రాష్ట్రంలో పోలీసు జులుం నడుస్తున్నదని మండిపడ్డారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరించడానికే అధికారం ఇచ్చారన్న విషయాన్ని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మరిచిపోయాయని విమర్శించారు.

హామీల అమలులో సీఎం రేవంత్ విఫలం

హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ విఫలమైందని, గ్రామ గ్రామానా హామీలపై కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, యువత, ఉద్యోగస్తులను, కార్మికులతో పాటు అన్ని వర్గాలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఊరుకుంటే ప్రభుత్వం కదలదని, కాబట్టి ప్రతీ ఒక్కరు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అన్నారు. డిగ్రీ చదువుకున్న ఆడపిల్లలకు స్కూటీల పంపిణీ ఏమైందని నిలదీశారు. మహిళలకు నెలకు రూ. 2500, కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఇవ్వలేదని, మైనారిటీలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా కాంగ్రెస్ సర్కార్ అమలు చేయలేదని ఎండగట్టారు. బీరాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం .... ఇప్పటి వరకు పెన్షన్లు మొత్తాన్ని పెంచలేదని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసాపై ప్రభుత్వం మాట్లాడడం లేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు శిష్యుడని, అందుకే తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతిపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ తల్లి స్థానంలో కాంగ్రెస్ మాతను ఏర్పాటు చేశారని, తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను మాయం చేసి తెలంగాణ

ఆడబిడ్డలను రేవంత్ రెడ్డి అవమానించారని తెలిపారు. "మన తెలంగాణ తల్లి మనకు కావాలి. తెలంగాణ తల్లి మాదిరా... కాంగ్రెస్ తల్లి మీదిరా. మన పొట్టమీదనే కాదు... మన సంస్కృతిపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేస్తున్నది" అని వ్యాఖ్యానించారు. రాబోయేది గులాబీ జెండా శకమే... అందులో సందేహమే లేదని తేల్చిచెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానే అని అన్నారు. బీఆర్ఎస్ సత్తాచాటి మళ్లొకసారి నిజామాబాద్ పవర్ ను సీఎం రేవంత్ రెడ్డికి రుచి చూపిద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు.





# భవిష్యత్తు సోషలిజానిదే..

- మోదీ విధానాలను తరిమికొట్టిన చరిత్ర రైతాంగ పోరాటానిదే..
- ప్రపంచంలో ఎవరికీ తలొగ్గని 'సంసాంగ్' కంపెనీ మెడలొంచిన ఎర్రజెండా
- మోదీ పాలనలో ఆర్థిక అసమానతలు
- మనువాద దృక్పథంతో దేశాన్ని పాలించాలని బీజేపీ కుట్రలు
- కేసీఆర్ బాటలోనే రేవంత్ నడక
- ఎన్నికల వాగ్ధానాల అమలులో కాంగ్రెస్ విఫలం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

దోపిడీకి గురవుతున్న కార్మిక, కర్షకులకు, వలసవాదంతో అసమానతలకు గురవుతున్న అణగారిన వర్గాలకు అండగా ఎర్రజెండా నిలుస్తోందని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు ఒక భాగమైతే, ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేస్తున్నది కమ్యూనిస్టు లేనన్నారు. రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) 10వ జిల్లా మహాసభ ఇబ్రహీంపట్నం లోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో రెండో రోజు కొనసాగింది. మహాసభల ప్రారంభం సందర్భంగా రెండవ రోజు సీనియర్ నాయకులు మధు సూదన్ రెడ్డి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అమరవీరుల స్థూపానికి జోహార్లు అర్పిస్తూ పార్టీ నాయకులు, కా ర్యకర్తలు అమరులను స్మరించుకున్నారు. అనంతరం ప్రారంభమైన ప్రతినిధుల సభలో పోతినేని ప్రారంభోపాన్యాసం చేశారు. ప్రపంచ పెట్టుబడి దేశాల్లో ప్రస్తుతం ఆర్థిక అసమానతలు నెలకొన్నాయన్నారు. సామ్రాజ్యవాద దేశాల్లో అణిచివేతకు గురవుతున్న ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారన్నారు. శ్రీలంకలో జరిగిన అధ్యక్ష, పార్లమెంట్ ఎన్నికల్లోనూ కమ్యూనిస్టులకే అధికారం అప్పగించారని గుర్తు చేశారు. దేశంలో రెండంకెల అభివృద్ధి జరుగుతుందని మోదీ చేస్తున్న వ్యాఖ్యలు అనాలోచితమన్నారు. దేశ ఆర్థిక వృద్ధి 5.4 శాతానికి పడిపోయిందన్నారు. రూపాయి విలువ డాలర్తో పోల్చితే 2014లో 59 రూపాయలు ఉండగా, ప్రస్తుతం రూ. 86కు చేరిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం 9 శాతం, పట్టణ ప్రాంతాల్లో 8.3శాతం పెరిగిందన్నారు. వీటి నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకు మోడీ వికృత విధానాలను అమలు చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ను ఉద్దేశించి అమిత్ చేసిన వ్యాఖ్యలు దేశ ప్రజానీకాన్ని అవమానించినట్టేనన్నారు. దీన్ని తప్పు పట్టాల్సిన ప్రధాని బలపర్చడం సిగ్గు చేటని విమర్శించారు. మనువాద దృక్పథంతో దేశాన్ని పాలించే దిశగా బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. తమిళనాడులో సంసాంగ్ కంపెనీలో కార్మిక సంఘం పెట్టుకునేందుకు వ్యతిరేకించిన ఆ సంస్థ యాజమాన్య మెడలు వంచి ఆ యజమానులతో కార్మికుల జెండా ఎగరేయించిన ఘనత ఎర్రజెండాదే అన్నారు. రైతాంగ వ్యతిరేక విధానాలను తేవాలని చూసిన మోడీ ప్రభుత్వాన్ని వెనక్కి కొట్టిన ఘనత కూడా కమ్యూనిస్టులదేనన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేసీఆర్ ఇడ్చిన చెప్పులోనే రేవంత్రెడ్డి ప్రభుత్వం నడుస్తున్నదని పోతినేని విమర్శించారు. రైతు రుణమాఫీ విషయంలో రూ.2లక్షల లోపు పూర్తి స్థాయిలో మాఫీ చేసినట్టు చెబుతున్నా. క్షేత్రస్థాయిలో మాఫీ కాలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో చేపడుతున్న ప్రక్రియను కాంగ్రెస్ కార్యర్తలతో చేయించడం సరైన పద్ధతి కాదన్నారు. ఇందిరమ్మ కమిటీల్లో అన్నీ సామాజిక వర్గాలకు స్థానం కల్పించి, పారదర్శకతను పాటించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలు అమలు చేయించే విధంగా ఎర్రజెండా నాయకత్వంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. జనవరి 2025లో సంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర సీపీఐ(ఎం) నాల్గవ మహాసభల్లో ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ, డీజీ నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామేల్, పి.యాదయ్య, జగదీష్, మధుసూదన్ రెడ్డి, కవిత, చంద్రమోహన్, శోభన్, జిల్లా కమిటీ సభ్యులు రాంచందర్, జగన్ తదితరులున్నారు.



## కన్నుల పండుగగా
# మల్లన్న కల్యాణం

- కొమురవెల్లికి పోటెత్తిన భక్తులు
- మల్లన్న శరణు అంటూ మార్మోగిన ఆలయ ప్రాంగణం
- ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:


కోరిన కోర్కెలు తీర్చే కోర మీసాల కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన మల్లన్న కల్యాణం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. తోట బావి ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై బలిజ మేడలాదేవి, యాదవుల ఆడబిడ్డ అయిన కేతలాదేవిని మల్లన్న కల్యాణం చేసుకొగా, వధువుల తరపున మహాదేవుని వంశస్థులు కన్యాదానం చేయగా వరుడి తరపున పడిగన్నగారి వంశస్తులు కన్యాదానం స్వీకరించారు. వీరశైవ ఆగమ శాస్త్రం ప్రకారం కాశీ పీఠాధిపతి శ్రీమద్ జ్ఞాన హాసనాధీశ్వర 1008 జగద్గురు మల్లికార్జున విశ్వరాధ్య శివాచార్య పర్యవేక్షణలో వేద పండితుల మంత్రోచ్చారణతో కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అర్చకులు సమర్పించారు. కల్యాణ మహోత్సవంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, బీసీ కమిషన్ మెంబర్ బాల లక్ష్మి, కొమ్మూరి ప్రతాప్ రెడ్డి హాజరు అయ్యారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో దృష్టి కుంభము, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కన్నుల పండుగగా జరిగిన మల్లన్న కల్యాణం తిలకించడానికి భక్తులు, శివసత్తులు బారులు తీరారు. మల్లన్న శరణు అంటూ జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది.

# విప్లవ శక్తుల మధ్య సమైక్యత వర్ధిల్లాలి

- ఈ ఐక్యత ఓ ఉద్యమ రూపం ధరించాలి
- డాక్టర్ పోటు నారాయణ

నిండా నూరేళ్ళ భారత కమ్యూనిస్ట్ ఉద్యమం, యాబదేండ్లకు పైబడ్డ నక్సలబరి విప్లవోద్యమం ఈ దేశానికి దశ దిశా చూపించాయి. సి.పి.ఐ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విరమణ, కాంగ్రెస్తో చెట్టాపట్టాలేసుకోవడం, ఆ తర్వాత వచ్చిన చీలిక సి.పి.ఐ (యం) గా ఏర్పడడం, మళ్ళీ పాలకపక్షంతో జతకట్టడం ఫలితంగా మరో చీలిక అదే సి.పి.ఐ (యంయల్) గా ఏర్పాటు. ఇక్కడే భారత రాజకీయాల్లో కీలక మార్పు చోటు చేసుకుంది. నక్సల్బరీ లో ఎగిసిన సాయుధ విప్లవ నిప్పురవ్వ దావానలంలా దేశానికి కాంతిని ఇచ్చింది. మార్క్సిజంలెనినిజంమావోయిజం సిద్ధాంత భూమికగా వ్యవసాయక విప్లవ ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంగా ఈ దేశ రాజకీయాల్లో విప్లవ రాజకీయ శిబిరం ఆరంభం అయింది.

వాస్తవానికి ఈ విప్లవ శిబిరం ఈ దేశంలో తన లక్ష్యాన్ని ఇంకా చేరలేదు, ఆ విప్లవ రహదారిలో సాగే ప్రయాణంలో అనేక విజయాలను కైవసం చేసుకుంది. ఇక్కడ ఈ విజయాలు ప్రజలు సాధించుకున్న హక్కులు, దోపిడీ పీడనల నుండి విముక్తి వంటివి. చారు



మజుందార్, కన్హయ్య ఛటర్జీ, సత్య నారాయణ సింగ్ , కొండపల్లి సీతారామయ్య, చంద్ర పుల్లా రెడ్డి, టి. ఎన్, డివి రావు లాంటి అనేక మంది నాయకత్వాన ఉన్న ఎం.ఎల్ పార్టీలు పంథా కార్యక్రమాల్లో తలెత్తిన చిన్నపాటి విబేధాల వలన చీలికలుగా ఏర్పడి అంతిమంగా పునరైక్యత వైపుగా కొనసాగిన చరిత్ర కూడా మన కల్లేదుట కనిపిస్తోంది.

ప్రత్యామ్నాయ విప్లవ రాజకీయాలను మరింత ప్రచారంలో పెట్టాలి. పీడిత ప్రజలను పదునైన వర్గ పోరాటాల్లోకి సమీకరించడం తక్షణ కర్తవ్యం కావాలి. దోపిడీ పాలకవర్గాల దుష్ట పాలనా విధానాల వల్ల పెరుగుతున్న కష్టాలకు చరమగీతం పాడాలి. పీడిత తాడిత ప్రజల మధ్య వ్యత్యాసాలు సృష్టించే ఫాసిస్ట్ విద్వేష విధానాల్ని ఓడించడానికి ఏకం కావాలి. అభివృద్ధి పేరిట సాగే విధ్వంసకర అభివృద్ధి నమూనాలను ప్రజల్లో ఎండగట్టి ఓడించాలి. ధ్వంసం అవుతున్న ప్రకృతి సంపదను కాపాడుకోవాల్సిన ఉద్యమ నిర్మాణ బాధ్యత విప్లవకారుల పై ఉన్నది. సకల దోపిడీ, పీడనల నుండి సమస్త మానవ జాతి విముక్తి కోసం ఆవిర్భవించిన కమ్యూనిస్ట్ సిద్ధాంతపు ఔన్నత్యాన్ని ఉన్నతంగా నిలబెట్టాలి. మనిషిని మనిషి గౌరవించుకునే కమ్యూనిస్టు సమాజాన్ని ఏర్పరచాలి. గ్లోబలైజేషన్ ప్రభావంతో కునారిలుతున్న ప్రజల మధ్య సంబంధాలను పునర్నిర్మించాలి. సమతా మమతలతో వెలుగుందేల క్రాంతి బాటన సాగిపోవాలి. ఇంత పెద్ద అసమాన సమాజాన్ని మార్చాలని రాజకీయ జీవితాలను ప్రారంభించిన విప్లవకారులు తమ మధ్యన వచ్చే వైరుధ్యాలను పాపంచిక కోణంలో పరిష్కరించుకొని ఐక్యంగా ముందుకు సాగాలి.

చీలికల ఫలితాలు ఎంత చేదుగా ఉంటాయో చవి చూసిన చేదు చరిత్ర ఉన్నది. విడిపోతే ఓడిపోతాం కలిసుంటే రాజ్యాలు గెలుస్తాము అనే సామాజిక సూత్రాన్ని యాది మరవద్దు. అనేక వర్గ సంకర రాజకీయాలు విప్లవ శిబిరంలోకి చొరబడి అల్లకల్లోలం చేస్తున్న ఈ సందర్భాన రెండు న్యూడెమాక్రసిలు 28 డిసెంబర్ 2024 నాడు ఒక్కటిగా ఐక్యతను సాధించడాన్ని విప్లవ రాజకీయాల ప్రేమికులుగా , ప్రజల తరపున వకల్తా పుచ్చుకున్న ప్రతి ఒక్కరు అభినందించాలి. ఈ విలీన పరిణామన్ని మనస్ఫూర్తిగా స్వాగతించాలి. ఈ ఐక్యత మరింత విస్తృతం అవ్వాలి. ఈ దారిలోనే దేశంలో అన్ని ఎం.ఎల్ పార్టీలు ఐక్యమయ్యి భారతదేశంలో విప్లవాన్ని సుసాధ్యం చేయాలి. ఇది విప్లవకాంక్షగా కాకుండా విప్లవాచరణగా మారి విప్లవోద్యమం పట్టాలెక్కి పరవళ్లు తొక్కుతుందని ఆశించుదాం.

## బుమ్రా@ 200 వికెట్లు

రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా బుమ్రాను బీబీసీఐ అభినందించింది. "జస్సీ భాయ్‌పై మాకు విశ్వాసముంది. 200 టెస్టు వికెట్లు, బూమ్ బూమ్ బుమ్రా. ట్రావిస్ హెడ్ లాంటి పెద్ద వికెట్ తీసి ఈ ఫీట్ సాధించాడు" అని బీసీసీఐ తన ఎక్స్‌లో పోస్ట్ చేసింది. తన 44వ టెస్టు మ్యాచ్‌లో బుమ్రా ఈ ఘనత సాధించాడు.దీంతో క్రికెట్ చరిత్రలో, టెస్టు మ్యాచుల్లో అత్యుత్తమ సగటుతో 200 వికెట్లు తీసిన ఫాస్ట్ బౌలర్ల లీగ్‌లో జస్ప్రీత్ బుమ్రా చేరాడు. వెస్టిండీస్‌కు చెందిన మాల్కమ్ మార్షల్, జోయెల్ గార్నర్, కర్ట్లీ ఆంబ్రోస్, ఇంగ్లడ్ బౌలర్ ఫ్రెడ్ ట్రూమెన్‌లను వెనక్కినెట్టి అత్యుత్తమ యావరేజ్‌తో జస్ప్రీత్ బుమ్రా టాప్‌లో నిలవడం విశేషం. అతి తక్కువ పరుగులిచ్చి 200 వికెట్లు తీయడమే కాకుండా, ఆయన స్ట్రైక్ రేట్ కూడా ఇతర బౌలర్ల కంటే మెరుగ్గా ఉంది. ఈ విషయంలో దక్షిణాఫ్రికా బౌలర్ కగిసో రబాడా తర్వాత బుమ్రా రెండో స్థానంలో నిలిచాడు. ప్రపంచంలోని మేటి బౌలర్లు, వారి యావరేజ్‌లు ఇలా ఉన్నాయి. జస్ప్రీస్ బుమ్రా - 19.38, మాల్కమ్ మార్షల్ - 20.94, జోయెల్ గార్నర్ - 20.97, కర్ట్లీ ఆంబ్రోస్ - 20.99, ఫ్రెడ్ ట్రూమెన్ - 21.57గా ఉంది.భారత్ తరఫున అతి తక్కువ మ్యాచుల్లో 200 వికెట్లు తీసిన బౌలర్లలో రవిచంద్రన్ అశ్విన్ అగ్రస్థానంలో ఉన్నాడు. అశ్విన్ కేవలం 37 టెస్టు మ్యాచుల్లోనే 200 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత బుమ్రా, జడేజా ఇద్దరూ తమ 44వ మ్యాచ్‌లో ఈ ఘనత సాధించారు.బుమ్రా కొత్త రికార్డుతో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**దోర్నకల్, విశాలభారతి:**

మరిపెడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 1997 98 బ్యాచ్ ఎస్ఎస్సి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో నిర్వహించబోయే పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సమావేశమైన 45 మంది విద్యార్థులు 28 సంవత్సరాల తర్వాత కలవడంతో ఉద్వేగానికి గురి అయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ మురిసిపోయారు.కొందరు పిల్లలకు పెళ్లిళ్లు చేసి షటిల్ కాగా,మరికొందరు పిల్లలను చదివిస్తూ,మరికొందరు జీవితంలో ఒంటరితనం కుటుంబ భారంతో సతమతమవుతూ కొందరు ఇంకా స్థిరపడక,అందరి కష్టసుఖాలను పంచుకొని కన్నీటి పర్యంతమైనారు.ఆనాటి గురువులను,తరగతి గది ముచ్చట్లను,పాఠశాల అనుభూతులను గుర్తుచేసుకొని పొంగిపోయారు.ఆనాటి రోజులు తిరిగి రావని గుర్తు చేసుకున్నారు. త్వరలోనే పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తామని దాని నిర్వాహన కోసం కమిటీ కూడా వేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మరిపెడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 1997 98 బ్యాచ్ ఎస్ఎస్సి విద్యార్థులు సరిత,పావని,రాధిక,మైబుబి,చాంద్ బి వినోద, వసంత,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



## డ్రైవర్ కుటుంబానికి సాయం

**పాలకీడు, విశాలభారతి:**

బోత్తల పాలెం గ్రామానికి చెందిన షేక్ నాగుల్ మీరా ఆటోడ్రైవర్ గా జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం పాలకీడు నుంచి బోత్తల పాలెం ఇంటికి బైక్ పై వస్తున్న సమయంలో బైక్ స్కిడ్ అయ్యి బోత్తల పాలెం గ్రామం ఊరి ముందల పడటం జరిగింది. తదుపరి హాస్పిటల్లో చేర్పించి, వైద్యం చేయించడం జరిగింది. కానీ వారం రోజులు మృత్యువు తో పోరాడి నేడు మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న తోటి డ్రైవర్లు, గ్రామ పెద్దలు, తదితరులు కలిసి వారి కుటుంబానికి తమ వంతు సాయంగా రూ 67,500 రూపాయలు వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తోటి డ్రైవర్లు, స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.



## గాల్లో కలిసిన 179 మంది ప్రాణాలు..

- దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం
- రన్‌వేపై అదుపు తప్పి గోడను ఢీకొట్టిన ఫ్లైట్
- ప్రమాద కారణాలపై అధికారుల దర్యాప్తు

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

దక్షిణ కొరియాలోని మువాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘోరం చోటుచేసుకుంది.. ఆదివారం ఉదయం జరిగిన విమాన ప్రమాదం 179 మందిని మింగేసింది. 175 మంది ప్రయాణికులు, నలుగురు విమాన సిబ్బంది ప్రాణాలు గాల్లో కలిశాయి. ల్యాండింగ్ గేర్ పనిచేయకపోవడం వల్లే విమాన ప్రమాదం చోటు చేసుకున్నట్టు అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. విమానం నేలపైకి దిగే సమయంలో టైర్లు పనిచేయలేదన్నారు అధికారులు. ఏదైనా పక్షిని ఢీకొనడం వల్లే టైర్లు పనిచేయకపోయి ఉండొచ్చని అంటున్నారు. థాయ్ రాజధాని బ్యాంకాక్‌కు చెందిన ది జేజు ఎయిర్ ఫ్లైట్‌కు చెందిన 7C2216 బోయింగ్ విమానం మయూన్ ఎయిన్‌పోర్టులో ఉదయం 9 గంటల ప్రాంతంలో ల్యాండ్ అవుతూ అదుపుతప్పింది. రక్షణ గోడను ఢీకొని మంటల్లో చిక్కుకొని పేలిపోయింది. విమానం ల్యాండ్ కావడానికి ప్రయత్నించిన సమయంలో ల్యాండింగ్ గేర్ సమస్యతోనే ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. విమానం నేలపైకి దిగిన తర్వాత రన్‌వే చివరికి వస్తున్న సమయంలో కూడా వేగాన్ని నియంత్రించుకోవడంలో విఫలమైందంటున్నారు. విమానం వేగం కంట్రోల్ కాకపోవడంతో ఎయిర్‌పోర్టు గోడను ఢీకొంది. దీంతో విమానంలో ఇంధనం ఒక్కసారిగా మండిపోయి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదం నుంచి ఇద్దరు సిబ్బంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. విమాన ప్రమాదం తర్వాత ముయాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అన్ని విమానాల రాకపోకలను రద్దు చేశారు.విమాన ప్రమాదంపై దక్షిణకొరియా తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ సాంగ్ మోక్ విచారం వ్యక్తం చేశారు. తక్షణమే అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఫ్లైట్ క్రాష్‌పై థాయ్‌ల్యాండ్‌కు చెందిన జేజు ఎయిర్ సంస్థ క్షమాపణలు తెలిపింది. ప్రమాద నివారణకు తాము శక్తివంచన లేకుండా ప్రయత్నించినట్లు వెల్లడించింది. బాధిత కుటుంబాలకు సాయం చేస్తామని పేర్కొంది. దక్షిణ కొరియాలో 1997లో జరిగిన విమాన ప్రమాదంలో 228 మంది మృతి చెందారు. ఆ తర్వాత ఇదే అతిపెద్ద ప్రమాదం ఇదేనని అధికారులు తెలిపారు.

**కెనడాలో మరో ప్రమాదం..**

179 మంది బలైన దక్షిణ కొరియా విమాన ప్రమాదం జరిగిన గంటల వ్యవధిలోనే కెనాడాలో మరో విమాన ప్రమాదం జరిగింది.. కెనడాలోని హాలీఫాక్స్ ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్టులో ఈ ప్రమాదం జరిగింది. హైడ్రాలిక్ సమస్యతో విమానం అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు పైలట్.. రన్‌వేపై విమానం రెక్కలు క్రాష్ కావడంతో మంటలు చెలరేగాయి. పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయని.. వెంటనే రెస్క్యూ చేసినట్లు అధికారులు తెలిపారు.





## ధ్యానంతో జ్ఞానం, మనస్సు స్థిరత్వం కలుగుతుంది

- పీఎస్ఎస్ఎం సభ్యురాలు, ధ్యాన గురువు పరిణీత పత్రి


**ఆమనగల్లు, విశాల భారతి :**

ధ్యాన సాధన చేస్తే జ్ఞానం, మనస్సు స్థిరత్వం, కలుగుతుందని, ప్రతి ఒక్కరి జీవితం శ్వాస పైనే ఆధారపడి ఉంటుందని పీఎస్ఎస్ఎం సభ్యురాలు, ధ్యాన గురువు పరిణిత పత్రి అన్నారు. కడ్తాల్ లోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ లో పత్రీజీ ధ్యాన మహా యాగం అత్యంత వైభవంగా జరుగుతోంది. యాగంలో 9వ రోజు నిర్వహించిన యోగా, వేదపఠనం, సంగీత నాధ ధ్యానం కార్యక్రమాలు ధ్యానులను బాగా ఆకట్టుకుంటున్నాయి. యోగా నిపుణులు వెంకటేశ్ యోగా ఆసనాలు, ప్రాణాయం, ముద్రలు, చక్రాలు వంటి గురించి అద్భుతంగా వివరించి వాటిపై ధ్యానులకు చక్కటి అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరు ప్రతిరోజు తప్పకుండా యోగా, ప్రాణాయం, ధ్యానం చేయాలని సూచించారు. అనంతరం చైతన్య, మాస్టర్ తేజాలు అద్భుతంగా వేదపఠనం చేసి ధ్యానులకు చక్కటి వేద జ్ఞానాన్ని అందించారు. సంగీత నాధ ధ్యానం కార్యక్రమం ధ్యానులను విశేషంగా అలరిస్తుంది. ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో ధ్యానులు పాల్గొని ఎంతో ఉత్సాహంగా ధ్యాన సాధన చేసి నృత్యాలు చేసి సందడి చేసారు. ధ్యాన మహా యాగంలో బ్రహ్మర్షి పత్రీజీ, స్వర్ణమాల పత్రీ వీడియా సందేశాలు ధ్యానులను బాగా ఆకట్టుకుంటున్నాయి. వీడియా సందేశాలు అందరికి అద్భుతమైన జ్ఞానాన్ని అందించాయి. అనంతరం పత్రీజీ కూతురు పరిణత పత్రీ, బ్రహ్మర్షి పత్రీజీ దివ్య సందేశం గురించి వివరించారు. మనం చేసేది ఏదైనా ఎక్కువ, తక్కువ కాకుండా చూడాలని తెలిపారు. ఈ ధ్యాన మహాయాగంలో పలు అద్భుత పుస్తకాలను ఆవిష్కరిస్తున్నారు. మహారాష్ట్ర మ్యాగజైన్ ను పత్రీజీ కూతురు పరిణిత పత్రీ, సీనియర్ పిరమిడ్ మాస్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మహారాష్ట్ర పిరమిడ్ మాస్టర్లు కలిసి ఆవిష్కరించారు. అనంతరం దేవి రచించిన దివ్యస్త్రీతత్వపు జాగృతి అనే పుస్తకం, అనంతరం అనిల్ కుమార్ రచించిన నా ధ్యాన డైరీ అనే పుస్తకం, ఆ తర్వాత రామ్మూ క్రియేషన్ అనే పుస్తకాన్ని పరిణిత పత్రీ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

## మట్టి కనిపిస్తే మాయం



- ఇబ్రహీంపట్నం , యాచారం , కందుకూరు మండలాల్లో జోరుగా అక్రమ మట్టి తవ్వకాలు
- కనుమరుగవుతున్న సహజసంపద
- ఏ పార్టీ అధికారంలో వుంటే వారితో అక్రమార్కుల సన్నిహిత్యం
- అక్రమ మట్టి తవ్వకాలు, పట్టించుకోని అధికారులు





**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

సహజ వనరుల దోపిడీ యధావిధిగానే కొనసాగుతున్నది. ఏ పార్టీ అధికారంలో వున్నప్పటికీ అక్రమార్కుల దందా మాత్రం ఆగడంలేదు. ఎవరు అధికారంలో వుంటే.. వాళ్లతో సన్నిహితంగా వుంటూ ప్రభుత్వ భూములు మట్టి, గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఇబ్రహీంపట్నం , కందుకూరు నియోజకవర్గంలో మట్టి మాఫియా విపరీతంగా చెలరేగుతోంది. వారు విదిల్చే కాసులకు ప్రభుత్వ అధికారులు కక్కుర్తి పడుతున్నారు. దీంతో మట్టిని అక్రమంగా తరలించే అక్రమార్కులకు బ్రేకులు వేసేవారే కనిపించడం లేదు. యాచారం , మంచాల ,ఇబ్రహీంపట్నం , కందుకూరు మండలాల్లో పెద్ద ఎత్తున అక్రమ మట్టి తవ్వకాలు పెద్ద ఎత్తున చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వి తీసుకొని వెళుతున్నా రు. ఇటుకల బట్టీలలో వాడేందుకు, రియల్‌ఎస్టేట్ వెంచర్లలో రోడ్లు వేసేందుకు ఈ మట్టి ఉపయోగ పడుతుండడంతో చెరువులోని మట్టిని ఎక్కడ పడితే అక్కడ ఎక్సకవేటర్లతో తవ్వి ట్రాక్టర్లు , టిప్పర్లలో తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.ఇటీవల యాచారం మండలంలో కుర్మిద్ద , నజ్జిక్ సింగారం గ్రామాల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు జరుగుతున్నాయి. కందుకూరు మండలంలోని ఆకుల మైలారం చెరువులో కూడా ఇటీవల అక్రమ మట్టి తవ్వకాలు విపరీతంగా జరిగాయి. ఈ మట్టి ఇటుక బట్టిలకు స్థానిక చోట మోట లీడర్ ఆధ్వర్యంలో జరిగినట్టు ప్రచారం ఉంది. ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో గ్రామ వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామ కార్యదర్శులు, పోలీసులు గ్రామస్థాయిలోనే ఉంచినప్పటికీ మట్టి తవ్వకాలు మాత్రం బహిరంగంగా జరుగుతున్నప్పటికీ పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. గ్రామస్థులు ఫిర్యాదులు వస్తే ఒకటిరెండు టిప్పర్ లు సీజ్ చేసి ఫైన్ వేసి చేతులు దులుపుకుంటున్నారనే వినికిడి వినిపిస్తుంది. అక్రమార్కులకు అధికారుల అండదండలు ఉండడంతో ఇచ్చిన కాడికి పుచ్చుకొని తమకెందుకులే అన్నట్లు ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వినిపిస్తూన్నాయి. ఇప్పటికైనా అధికారులు కల్పించుకొని సహజ సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
30.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## కాలనీ సమస్య అడిగి తెలియసుకున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్



పెద్ద అంబర్ పేట్, విశాలభారతి: హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆదివారం కమలానగర్ సీనియర్ సిటిజెన్ సభ్యులతో కలసి సమావేశామై కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు కాలనిలోని సమస్యలు మరియు కాలనీలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశం లో సీనియర్ సిటిజెన్ అధ్యక్షులు ఉపేందర్ , సంక్షేమ సంఘం సభ్యులు గోవర్ధన్, సారంగం,విట్టల్ , అచ్చయ్య , సత్య మూర్తి , చంద్ర మౌలి, నారాయణ, యాదగిరి, వెంకటయ్య, ప్రభాకర్, ప్రసాద్ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే వారు జాగ్రత్తలు పాటించాలి

- వేడుకల పేరుతో ప్రజా జీవనానికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు.
- జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు తో పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.
- సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట జిల్లా



సూర్యాపేట, విశాలభారతి

నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకునే వారు జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు పెద్దలు అందరూ వారి ఇండ్లలో ఉత్సవాలు జరుపుకోవాలని, పోలీసు వారి సూచనలు పాటించాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తరుపున భద్రత ఏర్పాట్లు చేయడం జరిగినదని తెలిపారు. డిసెంబర్ 31 రాత్రి వేడుకలు, నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగం మొత్తం ముఖ్యంగా పటిష్ఠమైన బందోబస్త్, నిత్యం పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది. పట్టణ, గ్రామీణా ప్రాంతాల్లోను డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనీఖీలు నిర్వహించబడుతాయని. అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంక్షలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పి హెచ్చరించారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసు అధికారులకు, డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు సేవలు ఉపయోగించుకోవాలని ఎస్పి కోరారు.

# అమిత్ షాను వెంటనే భర్తరఫ్ చేయాలి

- రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలనే కుట్రలో భాగంగానే అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

సూర్యాపేట, విశాల భారతి




అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలనే ఆర్ఎస్ఎస్ బిజెపి కుట్రలో భాగంగానే కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హైటెక్ బస్టాండ్ పక్కన గల శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్ లోసిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఆర్ఎస్ఎస్ భావజాలంతో రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి మనువాదాన్ని ప్రవేశపెట్టాలని చూస్తుందన్నారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న హోంమంత్రి పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్ ని అవమానపరిచే విధంగా వ్యాఖ్యానించడం దుర్మార్గమన్నారు. అంబేద్కర్ ని అవమానపరిచే విధంగా మాట్లాడిన అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ అభ్యుదయవాదులు, ప్రజాస్వామ్యవాదులు కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నేమ్మాది వెంకటేశ్వర్లు, ములకలపల్లి రాములు,నాగారపు పాండు, కోట గోపి,చెరుకు ఏకలక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకనబోయిన శేఖర్, జే.నరసింహారావు,వీరబోయిన రవి,పులుసు సత్యం,కందాల శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వాహనాలు తనిఖీ చేసిన ఎస్సై

సైదాపూర్, విశాల భారతి

సైదాపూర్ మండలంలో ఆదివారం సాయంత్రం సైదాపూర్ ఎస్సై చదువాల తిరుపతి విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, మత్తుపదార్థాలు, సారా, అక్రమ ఇసుక, ఇతర ప్రాంతాల మద్యం రవాణా కాకుండా ఈ తనిఖీలు నిర్వహించారు. అతి వేగంగా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులను, శబ్ద కాలుష్యాన్ని సృష్టించే ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను కలిగి ఉన్న వాహనాలను సైలెన్సర్లను తొలగించారు. వాహనదారులు హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు, వాహనాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. రికార్డులలు సక్రమంగా లేని వాహనాలను స్టేషన్లకు తరలించారు. డిసెంబర్ 31 రోజున మద్యం తాగి ఏలాంటి అల్లర్లకు పాల్పడవద్దని హెచ్చరించారు. కొత్త సంవత్సర వేడుకలు ప్రశాంతత వాతావరణంలో జరుపుకోవాలనన్నారు.



# యలమంచి ఉదయ్ కిరణ్ ట్రస్టు సామాజిక సేవలు అభినందనీయం

- కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బండి రమేష్

కూకట్ పల్లి,విశాలభారతి:

యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్ ను కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం కోసం, సామాజిక సేవలో ఎల్లప్పుడూ యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ముందుంటారని కొనియాడారు. ట్రస్ట్ చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ బండి రమేష్ ని శాలువాతో సన్మానించారు. చలివేంద్రం మెడికల్ క్యాంప్స్, ఉచిత పుస్తకాల పంపిణీ, గిఫ్ట్ ఆర్టికల్స్ ఫర్ డిసేబుల్డ్ చిల్డ్రన్, వృద్ధులకి ఆహారం పంపిణీ, బెడ్ షీట్స్ డిస్ట్రిబ్యూషన్ , అనాథ పిల్లలకు ఉచిత భోజనం,పుస్తకాలు మందులు పండ్లు పంపిణీ వంటి చాలా కార్యక్రమాలు నిర్వహించాం అని ఉదయ్ గుర్తుచేశారు.ఇలాగే ముమ్ముందు మరిన్ని కార్యక్రమాలు కూడా చేపడతామని తెలిపారు సామాజిక కార్యక్రమాలతో పాటు పార్టీ కార్యక్రమాలు సైతం చురుకుగా పాల్గొంటున్నారని రమేష్ ,ఉదయ్ కిరణ్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో యలమంచి ఉదయ్ కిరణ్ ట్రస్ట్ సభ్యులు, నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి ఖని పీజీ సెంటర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- యూనివర్సిటీ అభివృద్ధి కృషి చేయాలి
- వీసీ ప్రొ. ఉమేష్ కుమార్

సికింద్రాబాద్, విశాలభారతి:

ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో గతంలో ఉన్న పీజీ సెంటర్ గోదావరి ఖని పూర్వ విద్యార్థులు ( 1976 1995 ), ఫిజిక్స్ పూర్వ విద్యార్థులు (భౌతిక శాస్త్ర), ఆదివారం ఓయూ ఫిజిక్స్ విభాగంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా 6 సూత్రాల పథకం లో భాగంగా నాడు ఈ సెంటర్ ను ఓయూ పరిధిలో ఉండగా,తరువాత కాకతీయ యూనివర్సిటీ, ప్రస్తుతానికి శాతవాహన యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతోందని ఆ విద్యార్థులు పేర్కొన్నారు. ఇక్కడ విద్యా ను అభ్యశించిన విద్యార్థులు అన్ని రంగాల్లో ఉన్నారు.వారు వివిధ రూపాల్లో సేవాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటు, ఉల్లాసంగా ఉత్సహంగా గడిపారు. ముగింపు సందర్భంగా పాల్గొన్న శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొ.ఉమేష్ కుమార్ మాట్లాడుతూ. గోదావరి ఖని పూర్వ విద్యార్థులు ఇలా భేటీ కావడం హర్షణీయం అన్నారు.యూనివర్సిటీ అభివృద్ధి కి కలసి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మా తోడ్పాటు ఉంటుందని అన్నారు.ఇక ప్రతి సంవత్సరం ఇలా మీట్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ వీసీ లు ప్రొ. నరసింహ రెడ్డి, ప్రొ. సాయన్న, ప్రొ. విష్ణు వర్ధన్ రెడ్డి, లింగారెడ్డి, డీన్ ప్రొ. కరుణ సాగర్, హెడ్ శ్రీనివాస్,వేణు గోపాల్ రెడ్డి, యం.ఎన్.చారి, నాగేశ్వరరావు, సురేష్ బాబు,మధుకర్, షరీఫ్ , రాందేవ్, సత్తయ్య, తో పాటుగా ప్రొపెసర్స్, ఉద్యోగలు,సిబ్బంది పాల్గొన్నారు. వీరికి సత్కారం చేశారు.



# వైభవంగా లక్ష కుంకుమార్చన కార్యక్రమం

- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

కూకట్ పల్లి, విశాలభారతి:

హైదర్నగర్ డివిజన్ నిజాంపేట రోడ్డులోని కనకదుర్గ దేవాలయంలో ఆలయ కమిటీ,కామాక్షి బ్రాహ్మణ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మార్గశిర బళ చతుర్దశి తిథిని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. నిజాంపేట, సమతానగర్ , శ్రీనివాస్నగర్ సహా పలు ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది సువాసినిలు ఈ కుంకుమార్చనలో పాల్గొన్నారు. దుర్గామాత అష్టోత్తర, సహస్రనామావళి నడుమ భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం అన్న ప్రసాద వితరణను చేపట్టారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి మారేపల్లి, కల్యాణి, వెంకటరమణి, బాలపరమేశ్వరి,అచ్యుతకుమారి, జయశ్రీ, ఛాయాదేవి,దుర్గాభవాని ,పార్వతి, అనిత, గౌరి, మణి , కామాక్షి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# కాలనీల సర్వతోముఖ అభివృద్ధికి రాజీలేని కృషి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా,విశాలభారతి:

ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని కాలనీల సర్వతోముఖ అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం రాజీలేని కృషిని కొనసాగిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శివ సాయి నగర్, ఇందిరానగర్ కాలనీ సంక్షేమ సంఘాల కార్యాలయాల్లో జరిగిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలు బస్తీలలో రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు గుర్తుచేశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవ ముహూర్తం దగ్గర పడుతున్న క్రమంలో రోడ్లు జంక్షన్ల అభివృద్ధి త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తానని చెప్పారు. పేదలు మధ్యతరగతి కుటుంబాలు నివాసముండే కాలనీలకు వెళ్లే కుషాయిగూడ పోచమ్మ గుడి డిమార్ట్ శివ సాయి నగర్ వాసవి శివానగర్ రహదారి గుంతల మయం అయిందని బాక్స్ డ్రైన్ నిర్మాణంతోపాటు రోడ్డు నిర్మాణం అయ్యేలా కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య ప్రతినిధులు నాయకులతో పాటు శివ సాయి నగర్ ఇందిరానగర్ సంక్షేమ సంఘాల అధ్యక్ష కార్యదర్శి వర్గం సభ్యులు ఎంపల్లి పద్మా రెడ్డి, నేమురి మహేష్ గౌడ్, కొండగళ్ల అశోక్, బీవీ నర్సింహారెడ్డి, రామబ్రహ్మం, బర్ల రామచంద్రారెడ్డి, కాసుల సురేష్, బాణాల రామకృష్ణారెడ్డి, షాబాద్ దామోదర్ రెడ్డి, సత్యనారాయణ, శివకుమార్, సత్యనారాయణ రెడ్డి, చంద్రారెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చెక్ డ్యామ్ ని రిజర్వాయర్ చేయాలి

- మండల పార్టీ అధ్యక్షుడు ఎన్ వి సుబ్బారావు

పాలకీడు, విశాలభారతి:

కృష్ణానది వద్ద నూతనంగా నిర్మిస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుండి జాన్ పహాడ్ చెరువును ప్రత్యేకంగా రిజర్వాయర్ చేయుటకు నేరుగా జానపాడు చెరువుకు నీరు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని జాన్ పహాడ్ గ్రామానికి చెందిన రైతులు మండల పార్టీ అధ్యక్షుడు ఎన్ వి సుబ్బారావు ఆధ్వర్యంలో ఐడిసి డి ఇ నవీన్ కాంత్ కి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేయడం జరిగింది. ఇదేవిధంగా జాన్ పహాడ్ చెక్ డాం కూడా లిఫ్ట్ వాటర్ అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో తాగునీటికి కూడా ఇబ్బంది లేకుండా కృష్ణానది నీరు ఉపయోగం లోకి రావాలంటే కచ్చితంగా జాన్ పహాడ్ చెరువులో రిజర్వాయర్ గా మార్చాలని అభ్యర్థించారు. దీని పై డి.ఈ రైతుల అభ్యర్థన మేరకు అనుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తానని అన్నారు. అలాగే జాన్ పహాడ్ చెక్ డ్యామ్ కూడా లిఫ్ట్ వాటర్ అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.వి.సుబ్బారావు కోరారు. దీని మూలాన ఇలాంటి ఏర్పాటు చేయడం వల్ల జాన్ పహాడ్, కొత్త తండా, చెరువు తండా,కల్మెట్ తండ ,దర్గా పరిసర ప్రాంతాలకు సాగునీరే కాకుండా ప్రత్యేకంగా త్రాగునీరు కూడా శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేసినట్లు అవుతుందని సుబ్బారావు అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వూట్ల వెంకటేశ్వర్లు ,కూరపాటి కోటయ్య కాటూరి పుల్లారావు నాగెండ్ల ఆంజనేయులు, ఆవులమంద వెంకటేశ్వర్లు, షేక్ సైదా మస్తాన్ తదితర రైతులు పాల్గొన్నారు.



# అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం

- రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించిన కాంగ్రెస్ పార్టీ నేత మొక్తాల రమేష్

ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

వెల్దండ మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన గోరటి శ్రీశైలం అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మొక్తాల రమేష్ ఆదివారం ఆయనను పరామర్శించి వైద్య ఖర్చులు కోసం తనవంతు సహాయంగా రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మొక్తాల రమేష్ మాట్లాడుతూ శ్రీశైలం ఆరోగ్యం కుదుట పడేవరకు కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలోశానమోని కృష్ణయ్య, ఎండీ బాబా,గోరటి కృష్ణ,మహేష్ ముదిరాజ్ లు ఉన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
30.12.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily





## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

సూర్యాపేట, విశాల భారతి

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలనీ కోరుతూ ఆదివారం గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రీన్ వాక్ ను సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నెహ్రూ నగర్ లో నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా ప్రతి ఇంటికి స్టిక్కర్లు, కరపత్రాల పంపిణీ చేస్తూ ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రీన్ క్లబ్ ప్రశ్న అధ్యక్షులు ముప్పారపు నరేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి నుండి బయలుదేరేటప్పుడు చేతి సంచితో బయలుదేరి సామాగ్రి కొనుగోలు చేయాలని, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని, ప్రతి ఒక్కరూ తమ ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడంతోపాటు, వాతావరణ కాలుష్యానికి మొక్కలు నాటాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ ట్రస్ట్ కార్యవర్గం తోట కిరణ్ కుమార్ బొలిశెట్టి మధు, మారం పవిత్ర వందనపు శ్రీదేవి, దేవరశెట్టి నాగరాజు, అనంతల సువర్ణ యామా రజిని, దారం శ్రీనివాస్ గెల్లి అంజన్ ప్రసాద్ ,కక్కిరేణి రవిచంద్ర, మంచాల శ్యామ్, తల్లాడ రామచంద్రయ్య, కొక్కుల సంపత్,రావిరాల సురేందర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

దేవరుప్పుల విశాల భారతి



దేవరుప్పుల మండలం, కోలుకొండ గ్రామం నుండి ట్రాక్టర్ డ్రైవర్ ట్రాక్టర్ లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా దేవరుప్పుల ఎస్ఐ సృజన్ కుమార్ పక్కా సమాచారంతో ట్రాక్టర్ ను సీజ్ చేసి దేవరుప్పుల పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాక్టర్ డ్రైవర్లను హెచ్చరించారు.

## యోగ సాధకులకు సన్మానం

సూర్యాపేట, విశాల భారతి

ఈ నెల 22 న కరీంనగర్ లో జరిగిన యోగ పోటీలలో విజేతలుగా నిలిచిన యోగ సాధకులకు ఆదివారం సూర్యాపేట ఉన్నత యోగ శిక్షణ కేంద్రం యోగా గురువు చాడ పాపిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ ఎస్సై కుశలవ, అతిథులుగా సంత్ నిరంకార్ సంస్థ అధ్యక్షురాలు కదారి సరళ, డాక్టర్ నిర్మల్ కుమార్ పాల్గొనడం జరిగినది. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ కుశలవ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో యోగా ప్రతి ఒక్కరికి అవసరమని అన్నారు. మానసిక ఒత్తిడితో ఎంతోమంది బాధపడుతున్నారని, వారు యోగా చేయడం వలన ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, సహనం, ఓపిక ఏర్పడుతుందని తెలిపారు. యోగా చేయడం ద్వారా శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఎంతో ఉపయోగపడుతుందని ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు విద్యార్థులు ఎవరికైనా యోగ ఎంతో అవసరం అని అన్నారు. ఆరోగ్యం కొరకు యోగా చేసుకుంటూ యోగా పోటీలలో ,రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలలో పాల్గొంటూ మన సూర్యాపేటకు పేరు ప్రఖ్యాతలు చేస్తున్న సాధకులను అభినందించారు. అందులో ముఖ్యంగా మహిళలు వారి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వివిధ స్థాయిలలో మేమున్నామంటూ పోటీలలో పాల్గొని పథకాలు గెలవడం హర్షినియన్నారు.ఇక ముందు కూడా ఇలాంటివి ఎన్నో పథకాలు సాధించి మన సూర్యాపేటకు పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరడం జరిగినది. ప్రస్తుత తరుణంలో కంప్యూటర్ టెక్నాలజీ పెరగడంతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాధకులు భాస్కర చారి, సుదర్శన్ రెడ్డి, సుధాకర్, మమత, వి లింగయ్య,మల్లారెడ్డి, గోరంట్ల శ్రీనివాస్, బాణాల శ్రీనివాస్,సుజాత, కిరణ్మయి, సామ్రాజ్యం, స్వరూప, కల్పన, ధనలక్ష్మి, జయలక్ష్మి, మంజుల, అనిత, శ్రీదేవి, నాగలక్ష్మి, ఓ లింగయ్య, కృష్ణారెడ్డి, డాక్టర్ సతీష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.





## యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

ఆమనగల్లు, విశాల భారతి :

గ్రామీణ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మండ్లి రాములుచెప్పారు. ఆదివారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో నిర్వహించే టోర్నీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.నిర్వాహకులు పిర్యానాయక్,సంతోష్, కుమార్, రాజేష్ పాల్గొన్నారు.



## మాజీ ప్రధానికి క్రీడాకారుల నివాళి

ఆమనగల్లు, విశాల భారతి :

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు ఆదివారం ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో క్రీడాకారులునివాళులర్పించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్టోర్నమెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా వారితో పాటు గ్రామస్థులు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆయన మృతి దేశానికి తీరని లోటు అని, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదల మదిలో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కెఎన్ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్,మాజీ ఉపసర్పంచ్ మల్లేష్,రమేష్,నిరంజన్,భాస్కర్,రాజ్ కుమార్,డిల్లర్ కృష్ణ,డాక్టర్ సాయి పవన్, తెనాలి, జైరాం, రాజ్, గాంధీ, రఘు. పవన్, సంతోష్, ఉమ తదితరులు పాల్గొన్నారు.



## సారా స్థావరాలపై పోలీసుల దాడులు

దేవరప్పుల, విశాల భారతి

దేవరుప్పుల మండలంలోని సారా బట్టిలపై దాడులు నిర్వహించినట్లు దేవరుప్పుల ఎస్ఐ సృజన్ కుమార్ తెలిపారు. మండలంలోని మాల్యా తండాకు చెందిన భూక్య భాస్కర్ ఇంట్లో గుడుంబా తయారు చేయడానికి బెల్లం పాకం నిలువ చేసిందని, సమాచారం రాగా అక్కడికి వెళ్లి చూసేసరికి 70 లీటర్ల బెల్లం పాకం నిలువ చేసి ఉండగా, వాటిని ధ్వంసం చేసి వారిపై చట్టరీత్యా చర్య కొరకు ఎక్సైజ్ శాఖకు అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ సృజన్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోకి బెల్లం రవాణా చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని, సార కాసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని వారిపై పిడి యాక్ట్ అమలు చేస్తామని అన్నారు. ఈ ఆపరేషన్ లో దేవరుప్పుల పోలీస్ సిబ్బంది, యాకేష్, అశోక్, పిసీలు పాల్గొన్నారు.



## యువత స్వశక్తితో ఎదగాలి

- బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు గండూరి కృపాకర్

సూర్యాపేట, విశాల భారతి

యువత ఉద్యోగుల వెంట పడడం మానేసి స్వశక్తితో ఎదిగే దిశగా ఆలోచన మారాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు గండూరి కృపాకర్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రం 45వ వార్డులో నిర్వాహకులు చెరుకుపల్లి నాగరాజు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ షాపును ప్రారంభించి వారు మాట్లాడారు. యువతతో పాటు చదువుకున్న నిరుద్యోగులు స్వయం ఉపాధి రంగాల వైపు మొగ్గు చూపాలన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో మంచి క్వాలిటీతో మీకు ఫ్లెక్సీలు డిజైన్ చేసి సమయానికి అందిస్తారని అన్నారు. స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఫ్లెక్సీ షాపు 24 గంటలు అందుబాటులో ఉంటుందని, దీనిని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. నూతనంగా ప్రారంభించిన నిర్వహకులకు అన్ని లాభాలు చేకూరాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనుకు రేణుక, ఇస్మాయిల్, రవ్వ రాంబాబు, ప్రజాపతి బు, రేణుక, ఉపేందర్, అనిల్, శశి కుమార్, సైదులు, శంకర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



## నేడు జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

సూర్యాపేట, విశాల భారతి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర హోమ్ మినిస్టర్ అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 30వ తేదీన నేడు దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేయాలని దేశంలోని 10 వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు బూర వెంకటేశ్వర్లు ఎం సి పి ఐ జిల్లా కార్యదర్శి నజీర్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసం వామపక్షాల ఆధ్వర్యంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలపై అనేక పోరాటాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పార్లమెంటులో అంబేద్కర్ అవమానపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రిని వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ పై దుర్మార్గంగా మాట్లాడిన హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాల్లో ప్రజాస్వామికవాదులు అభ్యుదయవాదులు వామపక్ష వాదులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, కోట గోపి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కునుకుంట్ల సైదులు,పిడమర్తి భరత్, సిపిఐ సీనియర్ నాయకులు దంతాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యం పంపిణీ

సైదాపూర్, విశాల భారతి

మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన రుద్రారపు రాధమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఆదివారం మాదిగ ఇంటలెచ్చువల్ ఫోరం (ఎంఐఎఫ్) నాయకులు పరామర్శించి వారి కుటుంబానికి 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల రత్నం, ఎంఐఎఫ్ హుజురాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి రొంటాల సుమన్, కోశాధికారి మట్టెల ప్రకాష్, ఉపాధ్యక్షులు బొడిగె మల్లయ్య, ఎంఐఎఫ్ నాయకులు వెల్పుల ప్రభాకర్, మొలుగూరి కొమురయ్య, మోరే సతీష్ తదితరులు ఉన్నారు.



## రేషన్ డీలర్ కుటుంబానికి డీలర్ల సంఘం ఆర్థిక సహాయం

ఆమనగల్లు, విశాల భారతి :

కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ మహమ్మద్ అన్వర్ 3 రోజుల క్రితం మృతి చెందాడు. మృతునికి ఆదివారం మండల రేషన్ డీలర్ల సంఘం సభ్యులు నివాళులర్పించి మృతుని కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. సంఘం మండల అధ్యక్షురాలు సుజాత మల్లేష్ గౌడ్, సభ్యులు సత్యనారాయణ, బిచ్చ నాయక్, జంగయ్య, లక్ష్మయ్య,సుధాకర్ రెడ్డి, చంద్రశేఖర్, దశరథ్ పాల్గొన్నారు.



## మాజీ ఎంపీని పరామర్శించిన టీడీపీ నేత

ఆమనగల్లు, విశాల భారతి :


నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథంను ఆదివారం టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గం కోఆర్డినేటర్ యాదిలాల్ పరామర్శించారు. తీవ్ర అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మాజీ అధ్యక్షుడు కోట కృష్ణయ్య పాల్గొన్నారు.



## చిరంజీవితో కలిసి సినిమా చూశా..

టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ టైటిల్ రోల్ పోషిస్తోన్న చిత్రం గేమ్‌ఛేంజర్ . స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ భామ కియారా అద్వానీ, అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా డల్లాస్‌లో ఏర్పాటుచేసిన గేమ్‌ఛేంజర్ గ్లోబల్ ఈవెంట్‌లో డైరెక్టర్ సుకుమార్ మాట్లాడిన మాటలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. ఈ సినిమాను చిరంజీవితో కలిసి చూశాను. ఫస్ట్ హాఫ్ అద్భుతంగా ఉందని.. ఇంటర్వెల్ బ్లాక్ బస్టర్ అని చెప్పాడు. ఇక సెకండాఫ్‌లో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ గూస్‌బంప్స్ తెప్పించడం ఖాయమన్నాడు.

## అలా పిలవకండి.. పవన్ అభిమానులకు 'ఓజీ' టీమ్ రిక్వెస్ట్



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రీసెంట్‌గా తన అభిమానుల మీద అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లోని కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబుని శనివారం పవన్ కళ్యాణ్ పరామర్శించిన విషయం తెలిసిందే. అనంతరం మీడియాతో మాట్లాడుతుండగా.. అతని అభిమానులు ఓజీ.. ఓజీ.. ఓజీ.. సీఎం.. సీఎం అని పిలవడం మొదలుపెట్టారు. దీంతో అసహనానికి గురైన పవన్ కళ్యాన్.. అభిమానులను ఉద్దేశించి.. మీకు ఎక్కడ ఏం స్లోగన్ ఇవ్వాలో కూడా తెలియకపోతే ఎలా అయ్యా.. పక్కకి వెళ్లండి అంటూ అసహ్యించుకున్నాడు. దీంతో ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ విషయంపై తాజాగా ఓజీ టీం స్పందిస్తూ.. అభిమానులు ఓజీ అని పవన్‌ని పిలవద్దంటూ రిక్వెస్ట్ చేసింది. ఓజీ సినిమాపై మీరు చూపిస్తున్న అభిమానం, ప్రేమ మా అదృష్టంగా భావిస్తున్నాము. ఓజీ సినిమాను మీ ముందుకు తీసుకురావడానికి నిరంతరం పని చేస్తున్నాం. కానీ మీరు పవన్ కళ్యాణ్ గారు పొలిటికల్ సభలకు వెళ్లినప్పుడు, సమయం, సందర్భం చూడకుండా ఓజీ.. ఓజీ అని అరవడం, వారిని ఇబ్బంది పెట్టడం సరైంది కాదు. వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎంత కష్టపడుతున్నారో మనందరికీ తెలుసు. ఆ స్థానాన్ని, స్థాయిని గౌరవించడం మన కనీస బాధ్యత. అందుకని ఇంకొన్ని రోజులు ఓపికగా ఉందాం. 2025 ఓజీ పండుగ వైభవంగా నిలుస్తుందని మేము గట్టిగా నమ్ముతున్నాం అంటూ డీవీవీ ఎంటర్‌టైనమెంట్స్ రాసుకోచ్చింది.




## విశ్వక్‌సేన్ మాస్ స్టైల్.. లైలా నుంచి వీడియో సాంగ్

టాలీవుడ్ యాక్టర్ విశ్వక్‌సేన్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి రామ్ నారాయణ్ (డెబ్యూ) దర్శకత్వం వహిస్తున్న VS12. లైలా టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ లుక్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఇటీవలే విడుదల తేదీని ప్రకటిస్తూ కొత్త లుక్ కూడా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో స్టైలిష్ గాగుల్స్‌లో డ్యుయల్ ప్యాంట్‌తో ట్రెండీగా కనిపిస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాడు.తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ సోను మోడల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. నారాయణన్ రవిశంకర్, రేష్మ శ్యామ్ పాడారు. లియోన్ జేమ్స్ కంపోజ్ చేసిన ఈ పాటను విశ్వక్ సేన్ స్వయంగా రాయడం విశేషం. ఈ మూవీని వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.లైలా తొలి గులాబి న్యూఇయర్ 2025కు రాబోతుంది. ఈ వాలెంటైన్స్ డేకు ఎంటర్‌టైనింగ్ బ్లాస్ట్ ఉండబోతుందంటూ విడుదల చేసిన లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీలో ఆకాంక్ష శర్మ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. తనిష్క్ బాగ్చి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



## మాయలో పడిపోవాల్సిందే

'అలియాభట్ ఓ మాయ.. ఒక్కసారి ఆమెతో పనిచేస్తే ఆ మాయలో ఎవరైనా పడిపోవాల్సిందే. ఆమె ఆరా మనల్ని కూడా కమ్మేస్తుంది.' అంటున్నారు దర్శకుడు వాసన్‌బాల. ఇటీవలే అలియాతో ఆయన 'జిగ్రా' సినిమా తెరకెక్కించారు. ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోయినా.. అలియాతో పనిచేశానన్న తృప్తి మాత్రం 'జిగ్రా' వల్ల లభించిందని ఆయన అన్నారు. 'అలియాభట్ ఓ మాయ.. ఒక్కసారి ఆమెతో పనిచేస్తే ఆ మాయలో ఎవరైనా పడిపోవాల్సిందే. ఆమె ఆరా మనల్ని కూడా కమ్మేస్తుంది.' అంటున్నారు దర్శకుడు వాసన్‌బాల. ఇటీవలే అలియాతో ఆయన 'జిగ్రా' సినిమా తెరకెక్కించారు. ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోయినా.. అలియాతో పనిచేశానన్న తృప్తి మాత్రం 'జిగ్రా' వల్ల లభించిందని ఆయన అన్నారు. ' 'జిగ్రా' సీరియస్ సబ్జెక్ట్. ఆ కథలో కామెడీ లేదు. కానీ సెట్ అంతా ఎప్పుడు కామెడీగా ఉండేది. కారణం అలియాభట్. తను నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ ఓ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని క్రియేట్ చేయడం అలియా స్పెషాలిటీ. ఆమెతో ఒక్కసారి పనిచేశాక.. మళ్లీ ఇంకొకరితో పనిచేయడం చాలా కష్టం. ఎందుకంటే తనే గుర్తుకొస్తుంటుంది..' అంటూ మాట్లాడారు వాసన్‌బాలా. దీనిబట్టి అలియా మాయ ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థంచేసుకోవచ్చు.

## అల్లు అర్జున్-త్రివిక్రమ్ సినిమా కోసం స్పెషల్ స్టూడియో..



సిల్వర్ స్క్రీన్స్‌పై కొన్ని కాంబినేషన్లు వస్తున్నాయంటే అంచనాలు ఓ రేంజ్‌లో ఉంటాయి. అలాంటి కాంబోల్లో ఒకటి అల్లు అర్జున్ త్రివిక్రమ్ శ్రీనివాస్ . ఇప్పటికే జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురంలో సినిమాలతో వినోదాన్ని పంచింది. కాగా ఇద్దరి కలయికలో మరో సినిమా రాబోతుందని తెలిసిందే. చాలా రోజుల తర్వాత దీనికి సంబంధించిన క్రేజీ న్యూస్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది.నిర్మాత సూర్య దేవర నాగవంశీ ప్రస్తుతం డాకు మహారాజ్ సినిమా తెరకెక్కిస్తుండగా.. ఈ యాక్షన్ డ్రామా 2025 జనవరి 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఓ ఇంటర్వ్యూలో అల్లు అర్జున్, త్రివిక్రమ్ సినిమాపై క్లారిటీ ఇచ్చేశాడు నాగవంశీ. ఈ సినిమా షూటింగ్ కోసం ప్రత్యేకంగా ఓస్టూడియోను నిర్మిస్తున్నట్టు చెప్పాడు. కథానుగుణంగా స్టూడియో నిర్మించే ప్లాన్‌లో ఉన్నామన్నాడు. అంతేకాదు బన్నీ నెక్ట్స్ సినిమాలో వీఎఫ్ఎక్స్ పార్ట్ చాలా ఉంటుందని, ఈ నేపథ్యంలో స్టూడియో నిర్మిస్తున్న ఏరియాలో భారీ మొత్తంలో బడ్జెట్ ఖర్చుపెట్టబోతున్నట్టు తెలిపాడు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.